



శ్రీకాకుళం: బొందిలీపురం రోడ్డు ఇలా..

ఆదమరిస్తే.. అపాయమే

- గోతులమయమైన రహదారులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



అరసవల్లి: రాళ్లు తేలి, గోతులమయమైన శ్యాంపాలెం రోడ్డు

అరసవల్లి నుంచి శ్యాంపాలెం వెళ్లే రోడ్డు గోతులమయంగా మారింది. ఈ రోడ్డు మీదుగా సుమారు ఏడు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుం టారు. శ్రీకాకుళం నగరానికి కూతవేటు దూరంలోనే ఉన్నా, ఈ రోడ్డును బాగు చేసేందుకు ఎవరూ చొరవచూపడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.



పలాస రూరల్ : సున్నాడకు వెళ్లే రహదారి ఇలా..

అరసవల్లి/ ఎచ్చెర్ల/ పలాస రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. ఎక్కడికక్కడ రాళ్లు తేలి.. గుంతలమయంగా మారాయి. వైసీపీ ప్రభుత్వం రోడ్ల మరమ్మతులు పట్టించుకోలేదు. దీంతో గత ఐదేళ్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం పలు ప్రధాన రహదారుల మరమ్మతులు చేపడుతోంది. కానీ, పట్టణాల్లోని పలు జంక్షన్లు, గ్రామాల్లో రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించడం లేదు. దీంతో ఆయా రోడ్లపై ప్రయాణమంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. ఎక్కడికక్కడ గోతులు ఏర్పడడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు.

- ఎచ్చెర్ల మండలంలో తోటపాలెం జంక్షన్ నుంచి కొత్తపేట మీదుగా అంబేడ్కర్ నగర్ వరకు సుమారు 5 కిలోమీటర్లు పరిధి గల రోడ్డుపై ప్రయాణానికి ప్రజలు నరక యాతన పడుతున్నారు. సుమారు 15 ఏళ్ల కిందట ఈ రోడ్డు పనులు చేపట్టారు. ఆ తర్వాత ఈ రోడ్డును ఎవరూ పట్టించుకోలేదు. వర్షం పడిందంటే ఈ రోడ్డు చెరువును తలపిస్తుంది. ఈ రోడ్డును బాగుచేస్తే.. కొత్తపేట, తోటపాలెం, కొంగరాం, ముద్దాడ గ్రామ పంచాయతీల పరిధిలోని సుమారు 10 గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. నాబార్డు నిధులతో ఈ రోడ్డు పనులు చేపడతామని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.



ఎచ్చెర్ల : తోటపాలెం జంక్షన్ నుంచి కొత్తపేట వెళ్లే రోడ్డుపై గుంతలు ఇలా..

- పలాస మండలంలో బంటుకొత్తూరు, కేశుపురం, సున్నాడ గ్రామాల ప్రధాన రహదారులు అధ్వానంగా ఉండడంతో ప్రజల రాకపోకలకు అగచాట్లు తప్పడం లేదు. బ్రాహ్మణతర్లా మీదుగా బంటుకొత్తూరు గ్రామానికి వెళ్లే రహదారి కచ్చా రోడ్డు కావడం, గోతులు అధికంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సున్నాడ గ్రామానికి వెళ్లే అరకిలోమీటరు రహదారిని మట్టిరోడ్డుగానే వదిలేశారు. కేశుపురం రహదారి గోతులమయమైంది. చిన్నపాటి చినుకులు పడితే చాలు.. గోతుల్లో నీరు చేరడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.




అరసవల్లి: ప్రమాదకరంగా తయారైన ఇలిసిపురం రోడ్డు

- శ్రీకాకుళంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో కూడా (మిగతా 6వ పేజీలో..)

ఉపాధ్యాయ బదిలీలకు సన్నద్ధం

- నెలాఖరులో హెచ్‌ఎంలకు స్థానచలనం
- మేలో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలకు పదోన్నతులు
- స్పెషల్ కేటగిరీ అభ్యర్థులకు ఆరోగ్య పరీక్షలు



నరసన్నపేట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలకు పాఠశాల విద్యాశాఖ రంగం సిద్ధం చేస్తోంది. నిబంధనల మేరకు వేసవి సెలవుల్లో పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తిచేసేలా చర్యలు చేపడుతోంది. ఇప్పటికే సీనియారిటీ జాబితా రూపొందించి.. దానిపై పలు దఫాలుగా అభ్యంతరాలు స్వీకరించింది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పరంగా తయారు చేసిన సీనియారిటీ జాబితాపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా జడ్పీ పరిధిలో స్కూల్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంల పదోన్నతుల కోసం రూపొందించిన జాబితాలపై ఈ నెల 19వరకూ అధికారులు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఈ నెలాఖరున ఉమ్మడి జిల్లాలో హెచ్‌ఎంలకు బదిలీలు ఉంటాయి. ఆ తరువాత హెచ్‌ఎం పోస్టుల ఖాళీల మేరకు స్కూల్ అసిస్టెంట్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పిస్తారు. అనంతరం సీనియార్టీ ప్రాతిపదికన స్కూల్ అసిస్టెంట్‌లకు పదోన్నతి కల్పించి, స్కూల్ అసిస్టెంట్ టీచర్ల బదిలీలు చేపడతారు. తర్వాత (మిగతా 6వ పేజీలో..)

నెలాఖరు నాటికి డీఎస్సీ నోటిఫికేషన్

- డీఈవో తిరుమల చైతన్య



మాట్లాడుతున్న డీఈవో తిరుమల చైతన్య

టెక్కలి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరు నాటికి డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడనుందని జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య తెలిపారు. మంగళవారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 'ఈనెల 21 నుంచి కొత్త విద్యా సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యేలా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. బడిఈడు పిల్లలను గుర్తిస్తున్నాం. జిల్లాలో గతేడాది 2,44869 మంది విద్యార్థులు ఉండేవారు. ఈ ఏడాది 2.50 లక్షల మందికిపైగా విద్యార్థులు చేరేలా కృషి చేస్తున్నాం. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం నాటికి ఉపాధ్యాయులు భర్తీకి చర్యలు తీసుకుంటున్నాం. ఈనెల 21 నుంచి ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. 60మంది విద్యార్థులు దాటి, మూడు కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి ఉన్నత పాఠశాల లేకపోతే ఆయా ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా గుర్తిస్తాం. తరగతుల విలీనం విషయంలో ఆయా గ్రామాల ఎస్ఎంసీ కమిటీ, విద్యార్థుల ఆమోదం మేరకు నిర్ణయం తీసుకుంటాం. రానున్న విద్యా సంవత్సరం నుంచి సింగిల్ యాప్ విధానంతో పాఠశాలలు నిర్వహిస్తాం. ఇప్పటికే సుమారు ఐదులక్షల పుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయ'ని డీఈవో తెలిపారు. సమావేశంలో ఎంఈవోలు డి.తులసిరెడ్డి, డి.చిన్నారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి. చిత్రంలో పోలీసులకు పట్టుబడిన అంతర్రాష్ట్ర దొంగలు

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- పగలు సరుకుల రవాణా.. రాత్రివేళ చోరీలు
- పలాస పోలీసులకు చిక్కిన అంతర్రాష్ట్ర దొంగలు
- రూ.5.33లక్షల బంగారు ఆభరణాల స్వాధీనం

శ్రీకాకుళం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పలాస పోలీసులకు అంతర్రాష్ట్ర దొంగల ముఠా చిక్కింది. ఆ ముఠా సభ్యులు పగలు ఇతర రాష్ట్రాల నుంచి లారీల్లో సరుకులు తీసుకువస్తుంటారు. రాత్రివేళ తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడుతుండేవారు. గత నెలలో ఓ చోరీకి పాల్పడగా.. పలాస పోలీసులకు ముగ్గురు ముఠా సభ్యులు చిక్కారు. వారి నుంచి విలువైన బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ మహేశ్వరరెడ్డి వెల్లడించారు.

- జైలులో స్నేహం...

ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్ జిల్లా టీసీహెచ్-డెహ్రాడూన్‌లో అజాద్ కాలనీకి చెందిన నూర్‌హసన్(43), ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్ సిటీ శ్యామ్‌నగర్‌లో రెడ్డికాలనీకి చెందిన ఇర్షాన్ అహ్మద్(32), రాయ్‌పూర్ సిటీలో ఘజీనగర్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ గాఫ్ఫర్(59) దొంగతనాల కేసుల్లో గతంలో జైలుకు వెళ్లారు. అక్కడ వీరి మధ్య స్నేహం కుదిరింది. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడటం.. పోలీసులకు చిక్కితే జైలుకు వెళ్లి బెయిల్‌పై తిరిగివచ్చి మళ్లీ మరో రాష్ట్రంలో చోరీకి పాల్పడటం వీరివృత్తిగా చేసుకున్నారు. నూర్‌హసన్.. మరొక అంతరాష్ట్ర దొంగలముఠాతో కలసి హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలలో ఏకంగా 140 చోరీలకు పాల్పడ్డారు. ఇందులో మిగిలిన ముఠా పట్టుబడగా.. నూర్‌హసన్ మాత్రం తప్పించుకున్నాడు. జైలులో మరో స్నేహితులైన ఇర్షాన్ అహ్మద్, అబ్దుల్ గాఫ్ఫర్‌తో కలిసి ఆంధ్రప్రదేశ్, ఒడిశా, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో లారీలో తిరుగుతూ.. నేరాలకు పాల్పడుతుండేవారు. వీళ్లు దొంగిలించిన ఆభరణాలను ఉత్తర్‌ప్రదేశ్‌లో మాత్రమే విక్రయించేవారు. నెల కిందట ఒడిశా నుంచి ఆంధ్రాకు జీడిపప్పు తదితర సరుకులు లారీలో రవాణా చేసేందుకు వీరు పని కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా సోంపేట, ఇచ్ఛాపురం, మందస, వజ్రపుకొత్తూరు, పలాస, కాశీబుగ్గ ప్రాంతాల్లో సరుకులను తీసుకువచ్చినట్లే వచ్చి.. ఆయా ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి ఏకంగా 14 చోరీలు నిర్వహించారు. అందులో 85.49 గ్రాముల (మిగతా 6వ పేజీలో..)

ఇంజనీరింగ్ విద్యార్థులకు సువర్ణావకాశం

- స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్
- ప్రత్యేక అంశాలపై రెండు నెలల శిక్షణ

అరసవల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేలా స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ తాత్కాలిక ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ జిల్లా అధికారి యు.సాయికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి మూడవ, నాలుగవ సంవత్సరం చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది. కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ శాఖల విద్యార్థులు ఈ శిక్షణకు అర్హులు. రెండు నెలలపాటు సాగే ఈ శిక్షణలో 80గంటలు పాఠాలు బోధిస్తారు. 40 గంటలపాటు ప్రాక్టికల్ శిక్షణ అందిస్తారు. ముఖ్యంగా క్లౌడ్ కంప్యూటరింగ్, మొబైల్ యాప్ అభివృద్ధి, పైథాన్ ద్వారా డేటా విశ్లేషణ, వెబ్ డెవలప్‌మెంట్, అంతర్నిర్మిత వ్యవస్థలు, త్రీడీ ఆటల రూపకల్పన, కాటియా నమూనా రూపకల్పన, రెవిట్ ఆర్కిటెక్చర్ మోడలింగ్ అంశాల్లో అవగాహన కల్పిస్తారు. ఆన్‌లైన్ విధానంలో అనుభవజ్ఞులైన శిక్షకుల ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఉంటుంది. ప్రతీరోజు ప్రశ్నపత్రాలు, ప్రతీవారం అంచనాలు, ప్రాజెక్టు సమీక్షలు నిర్వహిస్తారు. శిక్షణ విజయవంతంగా పూర్తిచేసిన వారికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా ఏపీఎస్‌సీహెచ్‌ఈ గుర్తింపు కలిగిన ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ అందిస్తాం. మొదటి విడత ఏప్రిల్ 28న, రెండవ విడత మే 12న శిక్షణ ప్రారంభమవుతుంది. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.వెయ్యి మాత్రమే. ఆసక్తిగల విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 8790700295 నెంబరును సంప్రదించాల'ని సాయికుమార్ కోరారు.

ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి

- శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష

అరసవల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా తయారీకి విలువైన సూచనలు, సలహాలిచ్చి సహకరించాలని శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయిప్రత్యూష కోరారు. మంగళవారం శ్రీకాకుళంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఎపిక్ కార్డుతో ఒక్క వ్యక్తికి రెండు ఓట్లు ఉన్న మొత్తం జాబితాను వారికి అందజేశారు. ఓటర్ల నమోదు, మృతుల పేర్లు తొలగింపులో రాజకీయపార్టీల సహకారం ఎంతో ఉపయుక్తమని ఆర్డీవో తెలిపారు. సమావేశంలో శ్రీకాకుళం, గార తహసీల్దార్లు ఎస్.గణపతిరావు, పద్మావతి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు జీకె.శ్రీనివాసరావు, మాదారపు వెంకటేష్(టీడీపీ), కుమారి (కాంగ్రెస్), ఏ.శ్రీనివాసరావు(వైసీపీ), ఆర్.పురుషోత్తం(బీజేపీ) పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

క్రైమ్‌రేట్‌ను తగ్గించాలి

- జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా

గుజరాతీపేట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రైమ్‌రేటును తగ్గించేందుకు పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో పోలీసు అధికారులు, న్యాయవాదులు, న్యాయాధికారులతో ఆయన సమావేశమయ్యారు. జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా మాట్లాడుతూ.. 'జిల్లాలో జైలు ముద్దాయిల కేసులు పరిష్కరించే దిశగా అండర్ ట్రైల్ రివ్యూకమిటీ(యూటీఆర్సీ) దోహదపడుతుంది. బెయిల్ ఇచ్చి కూడా నిలిచిపోయిన, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, ముఖ్యంగా మహిళల విషయమై కమిటీలో చర్చించి బెయిల్‌పై త్వరగా పంపించడంలో ఇది తోడ్పడుతుంది. జాతీయ లోక్ ఆదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలి. మోటార్ యాక్సిడెంట్ కేసుల్లో బాధితులకు న్యాయపరమైన హక్కులను వివరిస్తూ లాభం చేకూర్చడమే న్యాయసేవాధికార సంస్థ లక్ష్యమ'ని తెలిపారు. కార్యక్రమంలో న్యాయాధికారులు పి.భాస్కరరావు, సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్, ఎస్.ఎం.ఫణికుమార్, కె.వి.ఎల్.హిమబిందు, ఆర్.సన్యాసినాయుడు, ఏఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు, జిల్లా పోలీసు అధికారులు, న్యాయాధికారులు పాల్గొన్నారు.

బారువలో బీచ్ ఫెస్టివల్

- 19, 20 తేదీల్లో నిర్వహణకు ఏర్పాట్లు

సోంపేట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఎత్తయిన ఇసుక దిబ్బలు.. ఎటు చూసినా పచ్చదనంతో ఆహ్లాదంగా కనిపించే కొబ్బరి తోటలు.. ఆధ్యాత్మికతను నింపే ప్రాముఖ్యత కలిగిన పురాతన ఆలయాలు.. ప్రత్యేక ఆకర్షణగా నిలిచే లైట్‌హౌస్, రిసార్ట్స్.. ఇవీ బారువ బీచ్ అందాలు. సోంపేట మండలంలో పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి చెందిన బారువలో బీచ్ ఫెస్టివల్ నిర్వహించాలని (మిగతా 6వ పేజీలో..)



బారువ లైట్‌హౌస్



నీలిరంగు గ్రానైట్ క్వారీ

నీలి గ్రానైట్‌కు ఊరట

- కన్సిడరేషన్ ఫీజులు రద్దు
- క్వారీల లీజు కేటాయింపులో వేలం విధానానికి స్వస్తి

టెక్కలి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర క్యాబినేట్ మంగళవారం తీసుకున్న నిర్ణయాలు జిల్లాలో నీలి రంగు గ్రానైట్ పరిశ్రమకు ఊరటనిచ్చాయి. గత ప్రభుత్వం గ్రానైట్ పరిశ్రమకు అనేక ఆంక్షలు విధించడంతో పూర్తిగా నీలిరంగు గ్రానైట్ పరిశ్రమ కుదేలైంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తాజా క్యాబినేట్ నిర్ణయాలపై గ్రానైట్ యాజమాన్యాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి. గ్రానైట్ లీజులకు సంబంధించి దరఖాస్తు నుంచి రద్దు వరకు, రెన్యువల్ నుంచి బదిలీ వరకు అంతా పారదర్శకంగా ఉండేందుకు డిజిటల్ గవర్నెన్స్ చేపట్టాలని కేబినెట్‌లో నిర్ణయించారు. 2021లో (మిగతా 6వ పేజీలో..)

మన కళాకారులకు 'కందుకూరి' పురస్కారాలు

- జిల్లా నుంచి ఆరుగురు ఎంపిక

6లో

చేనేతకు చేయూత

- ఇళ్లకు 200, పవర్‌లూమ్‌కు 500 యూనిట్లు విద్యుత్ ఉచితం
- కార్మికుల్లో హర్షం

8లో

మన కళాకారులకు 'కందుకూరి' పురస్కారాలు


గుత్తు చిన్నారావు


శోభన్‌బాబు


చలపతిరావు


కుమార్‌నాయక్

శ్రీకాకుళం కల్చరల్/కంచిలి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా ఈ పురస్కారాలకు మన జిల్లా కళాకారులను ఎంపిక చేసింది. రాష్ట్ర ప్రభుత్వం, స్టేట్ ఫిల్మ్, టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ పురస్కారాలను బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రదానం చేయనున్నారు. జిల్లా నుంచి ఈ పురస్కారాలకు ఐదు గురు ఎంపికయ్యారు. పురస్కారాలకు ఎంపికైన వారిలో గుత్తు చిన్నారావు (శ్రీకాకుళం), జెసూర్య ప్రకాశరావు, కుమార్‌నాయక్ (పలాస), బెం దాళం శోభన్‌బాబు (కత్తివరం), బల్లెడ చలపతిరావు (బొరివంక), మెట్ట పోలినాయుడు (శ్రీకాకుళం) ఉన్నారు. వీరికి పురస్కారం కింద రూ.10 వేల వంతున నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందించనున్నారు. 2018లో చివరిసారిగా కందుకూరి పేరిట పురస్కారాలు ఇచ్చారు. ఏడేళ్ల విరామం తరువాత మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం ఈ పురస్కారాలు ప్రదానం చేయనుంది. వీరికి జిల్లాకు చెందిన కళాకారులు, కళాభిమానులు అభినందించారు.

పలాసలో కొత్త పారిశ్రామికవాడ

● రామకృష్ణాపురం వద్ద 60.84 ఎకరాల కేటాయింపు


ఎమ్మెల్యే శిరీషతో చర్చిస్తున్న మురళీమోహన్

పలాస, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పలాసలో కొత్త పారిశ్రామికవాడ ఏర్పాటుకు ఏపీఐఐసీ రంగం సిద్ధం చేసింది. రామకృష్ణాపురం వద్ద 60.84 ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. త్వరల స్థలాలను ఆన్‌లైన్‌లో కేటాయించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషతో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మురళీమోహన్‌తో పాటు ఉన్నతాధికారుల బృందం మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో చర్చించింది. నియోజకవర్గంలో అనేక మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఉన్నా.. భూములు లేక కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయలేకపోతున్నారు. వ్యాపారులు ఎమ్మెల్యే శిరీష వద్ద ఈ అంశాన్ని అనేకమార్లు ప్రస్తావించారు. ఆమె కృషి మేరకు పారిశ్రామికవాడకు స్థలాలను ప్రభుత్వం కేటాయించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకున్న వారి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి, అర్హతలను బట్టి భూ కేటాయింపులు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, ఏపీఐఐసీ సిబ్బంది సూర్యనారాయణ, తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం

● రోజంతా మండిన ఎండలు ● సాయంత్రానికి జల్లులు

మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండతో అవస్థలు పడిన జనం..సాయంత్రానికి వాతావరణంలో మార్పులు...వర్షంతో ఉపశమనం చెందారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురవగా...మరికొన్నిచోట్ల ఉరుములు...మెరుపులు...ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షంతో జనం సేదదీరారు. కొన్ని ప్రాంతాలలో ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసిపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు.


నందిగాం: తడిసిన ధాన్యాన్ని పోగుపెడుతూ..


నందిగాం: ధాన్యంపై టార్పాలిన్లు కప్పి భద్రపరుస్తున్న రైతులు

నందిగాంలో..

నందిగాం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం ఉదయం నుంచి దఫదఫాలుగా వర్షపు జల్లులు కురిశాయి. కల్లాలు, రహదారులపై ఆరబెట్టిన ధాన్యం అకాల వర్షంతో తడిసిపోయాయి. ధాన్యాన్ని రక్షించుకునేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. వంశధారలో నీరు లేక అందుబాటులో ఉన్న ఇంజన్ల ద్వారా ఈ ప్రాంత రైతులు పండిస్తున్నారు. పంట చేతికి అందివచ్చిన సమయంలో ఇలా వర్షాలు పడడంతో ఏం చేయాలో తెలియక రైతులు లబోదిబోమంటున్నారు.


ఎచ్చెర్ల మండలంలో జాతీయ రహదారిపై..

జలుమూరులో..

జలుమూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో అన్నదాత దిగాలు చెందుతున్నాడు. ఖరీఫ్ కష్టాలు కళ్ల ముందు కదులాడుతుండగానే... మళ్లీ రబీ కష్టాలు రావడంతో ఏం చేయాలో దిక్కుతోచక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టించి ఇంటిలో ఉన్నదంతా వ్యవసాయ మదుపులకు పెట్టి రబీ వరి పంట చేతికందే సమయంలో ప్రకృతి రైతులపై కన్నెర్రజేసింది. మంగళవారం ఉన్నట్టుండి వర్షం కురవడంతో పండించిన పంటలను సంరక్షించుకోడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. వర్షం కురవడంతో కల్లాలు, రోడ్డు పక్కన ధాన్యాన్ని ఆరబోసిన రైతులు భద్రపరచుకోవడానికి అష్టకష్టాలు పడ్డారు. ధాన్యంపై టార్పాలిన్లు కప్పి, కాపాడుకునే ప్రయత్నం చేశారు.


జలుమూరు: వర్షానికి తడవకుండా ధాన్యాన్ని పోగు చేసుకుంటున్న దృశ్యం

ఎల్ఎన్ పేటలో...

ఎల్ఎన్ పేట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన చిరుజల్లులతో ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు. సాయంత్రం 5 గంటల నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉండడంతో వృద్ధులు, చిన్నారులు ఉక్కపోతతో విలవిల్లాడారు. సాయంత్రానికి ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి జల్లులు కురిశాయి. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

పాతపట్నంలో...

పాతపట్నం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షం వేసవి తాపం నుంచి ఊరటనిచ్చింది. ఎండలు, ఉక్కపోతతో అల్లాడిన జనానికి వర్షం కొంత సేదదీర్చింది. మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది.


పాతపట్నంలో కురుస్తున్న వర్షం

నీలి గ్రానైట్‌కు ఊరట

(ఐదో పేజీ తరువాయి)

కోవిడ్-19 ఖర్చుల నిమిత్తం సీనరేజ్ చార్జీలతో పాటు పెంచిన వందశాతం కన్సిడరేషన్ పన్నులు పూర్తిగా ఎత్తివేశారు. కొత్త లీజులకు, గరిష్ఠ కాలపరిమితి 20 ఏళ్ల నుంచి 30ఏళ్లకు, రెన్యువల్స్‌కు 15 నుంచి 20ఏళ్లకు పెంచారు. గ్రానైట్ క్వారీల లీజుల డెడ్‌రెంట్లు సైతం సవరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో త్రైమాసిక విధానం ఉండగా వాటిని వార్షికంగా లీజులు చెల్లించే విధంగా నిబంధనలు రూపొందించింది. రెన్యువల్స్ ప్రీమియం పదిరెట్ల వార్షిక డెడ్‌రెంట్ నుంచి ఐదురెట్ల వార్షిక డెడ్‌రెంట్‌కు తగ్గించారు. అలాగే ఇది రెండు దశల్లో చెల్లించవచ్చును. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని క్యాబినేట్‌లో నిర్ణయించారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన వేలాం విధానాన్ని తొలగించి గతంలో ఉన్నట్లు మొదటగా దరఖాస్తు చేసుకున్న వారికి అన్నీ సక్రమంగా ఉంటే లీజులు కేటాయింపులకు అనుమతులు ఇవ్వనున్నారు. గ్రానైట్ క్వారీలకు సంబంధించి పలు పెండింగ్ కేసులు పరిష్కారానికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ఇవ్వాలని నిర్ణయించారు. జరీమానాలు కూడా పదిరెట్ల సీనరేజ్ ఫీజు నుంచి రెండు రెట్లుకు, ఐదురెట్ల సీనరేజ్ ఫీజ్ ఒక రెట్టుకు తగ్గించారు. ఫలితంగా ప్రభుత్వానికి రెవెన్యూ సులభంగా వసూలుకానుంది. గ్రానైట్ యాజమాన్యాలకు ఊరట లభించనుంది.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

(ఐదో పేజీ తరువాయి)

బంగారాన్ని, 3కిలోల 70గ్రాముల వెండి.. మొత్తంగా రూ.12.93 లక్షల ఆభరణాలను ఎత్తుకెళ్లారు.

● ఈ ఏడాది మార్చి 14న రాత్రి కాశీబుగ్గలో ఇంటికి తాళం వేసి పాడి చంద్రశేఖరరావు కుటుంబంతో సహా బంధువుల పెళ్లికి వెళ్లారు. ఈ ఇంటిలో 3కిలోల 70 గ్రాముల వెండిని ముఠా సభ్యులు చోరీచేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందడంతో ప్రత్యేక బృందాలను ఎస్పీ ఆదేశాలతో నియమించారు. మంగళవారం వాహనాల తనిఖీల్లో భాగంగా గొప్పిలి వైపు సీజీ04 ఎన్‌క్యూ5609 నంబరుగల లారీపై ముగ్గురు వ్యక్తులు వస్తుండగా.. లారీని ఆపి పోలీసులు తనిఖీ చేశారు. చోరీకి గురైన రూ. 5.33 లక్షలు విలువైన వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వారు అంతరాష్ట్ర దొంగల ముఠాగా నిర్ధారించారు. నిందితులను అరెస్ట్ చేసి జిల్లా పోలీసు కార్యాలయానికి తరలించారు. ఈ మేరకు ఎస్పీ మాట్లాడుతూ పలు రాష్ట్రాల్లో 32 కేసుల్లో నిందితులు ఇంకా అరెస్ట్ కావాల్సి ఉందని తెలిపారు. ముఠాను పోలీసులను అభినందించారు. ఏఎస్పీ శ్రీనివాసరావు, కాశీబుగ్గ డీఎస్పీ వెంకటఅప్పారావు, సీఐ సూర్యనారాయణ, సీసీఎస్ సీఐ సూర్యచంద్రమౌళి, ఎస్ఐ మధుసూధనరావు, ఫింగర్‌ప్రింట్ ఎస్ఐ భరత్, కాశీబుగ్గ స్టేషన్ హెచ్‌సీలు శ్రీనివాస్, గవరయ్య, పీసీలు ఉషాకిరణ్, కోదండరావు, నీలకంఠం, సీసీఎస్ పీసీలు మాధవరావు, ఉమామహేశ్వరరావును అభినందించి ప్రశంసించారు.

ఆర్పీఎఫ్ కార్యాలయంలో నాగుపాము



పలాస, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న ఆర్పీఎఫ్ కార్యాలయంలో భారీ నాగుపాము కలకలం రేపింది. సోమవారం రాత్రి సిబ్బంది అంతా విధుల్లో ఉండగా నాగుపాము కార్యాలయంలోకి చొరబడింది. పామును చూసి సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. ఈస్ట్రన్‌ఘాట్ వైల్డ్‌లైఫ్ సొసైటీ సభ్యుడు ఓంకార్‌త్యాడికి సమాచారం ఇవ్వడంతో రాత్రి 11 గంటల సమయంలో అతికష్టంపై పామును బంధించి సమీప మెండు అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. రైల్వేకాలనీలో ఇటీవల పాడుబడి నగృహాలు నేలమట్టం చేసి... చదును చేయడంతో ఆ ప్రాంతంలో సంచరించే పాములు నివాసాల్లోకి చేరుతున్నాయి.


పూండిలో పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోసం శిక్షణ పొందుతున్న విద్యార్థులు

'పాలిటెక్నిక్' కల నెరవేరేదెప్పుడో!

● ఉద్దానం విద్యార్థులకు అందని సాంకేతిక విద్య

● దశాబ్దాలుగా ఎదురుచూపులు

కాశీబుగ్గ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉద్దానం ప్రాంత ప్రజలకు సాంకేతిక విద్య అందని ద్రాక్షగా మిగులుతోంది. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. వీరికి సాంకేతిక విద్య అందని ద్రాక్షగా మారుతోంది. ముఖ్యంగా పాలిటెక్నిక్ కళాశాలను అందుబాటులోకి తేవాలన్న ఈ ప్రాంతీయుల దశాబ్దాల డిమాండ్ నెరవేరడం లేదు. ఉద్దానం ప్రాంతానికి ముఖ్య కేంద్రమైన పలాసలో దీనిని ఏర్పాటు చేస్తే అన్ని ప్రాంతాల ప్రజలకు న్యాయం జరుగుతుంది. కానీ ఆ దిశగా ఎటువంటి ప్రయత్నాలు జరగడం లేదు. దీంతో విద్యార్థులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. దీని వల్ల వ్యయప్రయాసలు తప్పడం లేదు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అన్ని కాలేజీలు ఉన్నా..

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఉంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎయిడెడ్ డిగ్రీ కాలేజీ కొనసాగుతోంది. డాక్టర్ కణితీస్ ప్రభుత్వ ఐటీఐ కాలేజీ ఉంది. కానీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ మాత్రం అందని ద్రాక్షగా ఉంది. సాంకేతిక విద్యకు సంబంధించి ఎటువంటి విద్యాసంస్థలు లేవు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో చేరాలంటే 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీకాకుళం కానీ.. ఆమదాలవలస కానీ వెళ్లాల్సి వస్తోంది. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల విద్యార్థులకు ఇది మరీ దూరం. ఆ రెండు కాలేజీలు పక్కపక్కనే ఉన్నాయి. కానీ టెక్కలి, పలాస డివిజన్లలో మాత్రం ఏర్పాటుచేసే ప్రయత్నం ఏ ప్రభుత్వమూ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ప్రైవేటు సంస్థల్లో చదువులు..

టెక్కలి, పలాస డివిజన్ల విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు సంస్థలను ఆశ్రయిస్తున్నారు. దీంతో యాజమాన్యాలు అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయి. కొందరు విద్యార్థులు పక్కనే ఒడిశాలోని బరంపురంలో ఉన్న పాలిటెక్నిక్, ఐటీఐ కాలేజీల్లో చేరుతున్నారు. ప్రస్తుత పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు సాంకేతిక విద్య అవసరం. చివరకు రక్షణ రంగాల్లో ఎంపికలకు సైతం సాంకేతిక విద్యకు పెద్దపీట వేస్తున్నారు. రైల్వేతో పాటు ఇతర రంగాల్లో సైతం సాంకేతిక విద్య ఉన్న వారికి ప్రాధాన్యం దక్కుతోంది. డిప్లమోతో పాటు ఐటీఐ చేసిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సులువుగా దక్కుతున్నాయి. సాంకేతిక విద్య అందుబాటులో లేకపోవడంతో ఈ ప్రాంతానికి చెందిన పేద విద్యార్థులు ఉద్యోగావకావకాశాలకు దూరమవుతున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలి



పలాసలో పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలి. టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం, పాతపట్నం నియోజకవర్గాల పరిధిలో వేలాది మంది విద్యార్థులకు సాంకేతిక విద్య అందడం కష్టమవుతోంది. సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అందుకే ఇక్కడ వాటిని ఏర్పాటు చేయాలి.

- ఎ.చాందిని, విద్యార్థిని, అంగవానిపేట

దశాబ్దాల డిమాండ్



పలాసలో పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటు చేయాలన్నది దశాబ్దాల డిమాండ్. కానీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలి. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలి. ఎలాగైనా పలాసలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలి

- యువరాజు, విద్యార్థి, పెద్దమురహరిపురం

ఆదమరిస్తే.. అపాయమే

(ఐదో పేజీ తరువాయి)

కాలువలపై వేసిన పలకలను డీసిల్టింగ్ సమయంలో తొలగించి, మళ్లీ సరిగ్గా వేయకపోవడంతో పాదచారులకు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలిసిపురంలోని రైతుబజార్ కూడలి వద్ద కాలువపై పలకలు అస్తవ్యస్తంగా ఉండడం, రోడ్డుపై గోతులు ఏర్పడడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డును అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడం గమనార్హం. కాలువపై పలకలను సరిచేసి, ప్రయాణానికి అనువుగా రోడ్డును తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే బాకర్ సాహెబ్‌పేటలో డ్రెయిన్ పలకలు పాడై, మురుగునీరు పేరుకుపోయింది. బొందిలీపురం పాత ఎంప్లాయిమెంట్ ఆఫీసు రోడ్డు వద్ద పలకలు విరిగిపోయి, చెత్తాచెదారంతో కాలువ నిండిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

బారువలో బీచ్ ఫెస్టివల్

(ఐదో పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 19, 20వ తేదీల్లో బీచ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఇటీవల ఆదేశాలు జారీచేశారు. పలాస ఆర్డీవో ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఫెస్టివల్‌కు తహసీల్దార్ ప్రముఖులకు ఆహ్వానం పలకాలని కోరారు. కాశీబుగ్గ డీఎస్పీ ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని, జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని సూచించారు. డీడీ ఫిషరీష్ లైఫ్‌గార్డ్ బోటులు ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటకశాఖ అధికారి, డీఎస్‌డీవో, వైద్య, మెరైన్, అగ్నిమాపక, ఆర్అండ్‌బీ, అటవీ, నీటిపారుదల, విద్యుత్ శాఖ అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఇటీవల జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, పలాస ఆర్డీవోతోపాటు పలువురు అధికారులు బారువ బీచ్‌ను సందర్శించారు. ఇక్కడ పర్యాటక అభివృద్ధికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని గుర్తించారు. బీచ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్టు వెల్లడించారు. కాగా.. దీనిపై ప్రచారం విషయంలో అధికారులు వెనుకబడి ఉన్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రచారం ఆశించినస్థాయిలో లేకపోతే ఫెస్టివల్‌కు పర్యాటకులు ఎలా వస్తారనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

వసతులు ఏర్పాటు చేయాలి

బారువ బీచ్‌లో ఏటా కార్తీకమాసంలో పిక్నిక్ సందడి కనిపిస్తుంది. వేలాది మంది పర్యాటకులు ఈ బీచ్‌కు వస్తుంటారు. అలాగే శుభదినాల్లో మహేంద్రతనయ నదీ సంగమంలో స్నానాలు ఆచరిస్తుంటారు. రెండో ప్రపంచ యుద్ధకాలంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఓడ అవశేషాలు ఇక్కడ కనిపిస్తాయి. లైట్‌హౌస్ నుంచి చూస్తే.. ఒకవైపు సముద్రం, మరోవైపు కొబ్బరితోటల అందాలు ఎంతో ఆహ్లాదానిస్తాయి. ఇక్కడ కోటిలింగేశ్వరాలయం, జనార్దనస్వామి, వేణుగోపాలస్వామి వంటి పురాతన ఆలయాలతోపాటు అమ్మవారి ఆలయాలు ఉన్నాయి. ఇంతటి ఆహ్లాదకరమైన బారువ తీరం అభివృద్ధికి నోచుకోవడం లేదు. బారువ బీచ్‌కు సరైన రహదారి, విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ఏర్పాట్లు మాత్రం కనిపించవు. బీచ్ ఫెస్టివల్‌లో పర్యాటకులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల బదిలీలకు సన్నద్ధం

(ఐదో పేజీ తరువాయి)

ఎస్జీటీల బదిలీ ప్రక్రియ నిర్వహిస్తారు. ఈసారి భారీగా బదిలీలు అయ్యే అవకాశం ఉంది. 2017లో భారీగా బదిలీలు జరిగాయి. అప్పట్లో బదిలీలు అయిన ఉపాధ్యాయులు ఒకేచోట ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్నారు. అందువల్ల విధిగా వీరికి ఆయా స్థానాలు నుంచి స్థానచలనం కలుగుతుంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 1200 మంది ఉపాధ్యాయులకు బదిలీలు జరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘ నాయకులు చెబుతున్నారు.

24 నుంచి వైద్య పరీక్షలు

ఉపాధ్యాయ బదిలీ చట్టం మార్గదర్శకాలు ప్రకారం బదిలీల్లో ప్రాధాన్యత కలిగిన వారు ఈనెల 24 నుంచి 26 వరకు ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు పరిశీలించడానికి జిల్లా సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని ఇటీవల విద్యాశాఖ అదేశాలు జారీచేసింది. స్పెషల్ కేటగిరీలో బదిలీ కానున్న ఉపాధ్యాయుల్లో 80శాతం లేదా అంతకంటే ఎక్కువ దృష్టిలోపం/ శారీరకంగా సవాలు చేయబడిన వారు(ఆర్థోపెడిక్), వినికిడి లోపం, గుండెలో రంధ్రం పూడ్చడం, అవయవ మార్పిడి, పెద్దనాడి శస్త్రచికిత్స, ఎముకల్లో క్షయ, కిడ్నీ మార్పిడి తదితర వ్యాధుల ధ్రువీకరణ ప్రతాలను అనుసరించి ప్రాధాన్యం కల్పిస్తారు. పుట్టుకతో గుండె సంబంధిత వ్యాధులు కలిగిన పిల్లలకు శస్త్రచికిత్స చేసిన తేదీ నుంచి మూడేళ్లలోపు పాధాన్య వర్గంగా పరిగణించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.రామరాజు ఆదేశాలు జారీ చేశారు. ఆరోగ్య కారణాలపై బదిలీ కోరుకునే ఉద్యోగులు సంబంధిత వైద్య మండలి ధ్రువీకరించిన తాజా వైద్య నివేదికలు పొందాలని స్పష్టం చేశారు.

ఆదిత్యుని దర్శించుకున్న కలెక్టర్


కలెక్టర్‌ను ఆశీర్వదిస్తున్న ప్రధాన అర్చకులు శంకరశర్మ

అరసవల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆయనకు స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అనివెట్టి మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి ప్రసాదాలను ఆలయ సీనియర్ అసిస్టెంట్ అట్టాడ శ్రీనివాస్ కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ రమణమూర్తి, అర్చకులు ఇప్పిలి ఫణీంద్రశర్మ, రంజిత్ శర్మ, వికాస్ శర్మ, సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ లేక.. పిచ్చిమొక్కలు పెరిగి

● భయాందోళన చెందుతున్న చిన్నారులు

● ఇదీ బందరువానిపేటలోని అంగన్‌వాడీ కేంద్రం-4లో దుస్థితి

గార, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బందరువానిపేటలో అంగన్‌వాడీ కేంద్రం-4 నిర్వహణపై పర్యవేక్షణ లేకపోవడంతో ఆవరణలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరగడంతో చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఆహ్లాదకరంగా ఉండాల్సిన అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరగడంతో విష జంతువులు, కీటకాలు సంచరించే అవకాశముందని పలువురు వాపోతున్నారు. పిల్లలు ఆడుకునే సమయంలో అవి వారిపై దాడిచేస్తే ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భీతిల్లుతున్నారు. కేంద్రం వద్ద పిచ్చిమొక్కలు పెరగడంపై ఐసీడీఎస్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.పిచ్చిమొక్కలతోపాటు ముళ్లపొదల వల్ల చిన్నారులు అరుగుపై ఆడుకోవడానికి వీల్లేకుండాపోయింది.అంగన్‌వాడీ కేంద్రంవద్ద పిచ్చిమొక్కలుతొలగించేందుకు అధికారులు చర్యలుతీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



అంగన్‌వాడీకేంద్రం ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు

రోడ్డుపై స్తంభాలు.. రాకపోకలకు అగచాట్లు

● 108 వాహనం కూడా రాలేని దుస్థితి

● ఇదీ కర్లెమ్మ పంచాయతీలోని నేతాజీనగర్ కాలనీలో పరిస్థితి

కొత్తూరు, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లెమ్మ పంచాయతీ పరిధిలోగల నేతాజీనగర్ కాలనీకి ఆనుకుని ఉన్న రెండువీధుల్లో విద్యుత్ స్తంభాలు రోడ్డుకు అడ్డంగా ఉండడంతో అగచాట్లు తప్పడంలేదు.ఇటీవల వీధిలో జనాభా పెరగడంతోపాటుకాలనీ విస్తరించడంతో ఇక్కడ జనసంచారం పెరిగింది. ఈ నేపథ్యంలో స్తంభాలు ఏర్పాటుచేసే సమయంలో ఆ శాఖ అధికారులు రోడ్డు మధ్యలో అప్పట్లో ఏర్పాటుచేశారు. తర్వాత రోడ్డు పక్కకు మార్చాలని పలుసార్లు విజ్ఞప్తులుచేసినా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోలేదని స్థానికులు వాపోతున్నారు. వరుసగా రెండు స్తంభాలు రోడ్డుపై అడ్డంగా ఉండడంతో నాలుగు చక్రాల వాహనాలు రావడానికి వీల్లేకుండా పోయింది. ప్రధానంగా ఎవరికైనా అత్యవసర సమయంలో 108లో ఆస్పత్రిలో చేర్చడానికి వీల్లేకుండా పోయింది. తక్షణమే ట్రాన్స్‌కో అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభాలు ఒక పక్కకు మార్చి అవస్థలు తీర్చాలని పలువురు కోరుతున్నారు.



వీధిలో అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభం

బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన బాలల నుంచి జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 31వ తేదీకి ఐదు నుంచి 18 ఏళ్ల మధ్య వయసు గల వారు సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, ధైర్య సాహసాలు, పర్యావరణం, క్రీడలు, కళలు, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు తదితర అంశాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన భారత సంతతికి చెందిన వారు అర్హులని పేర్కొన్నారు.అర్హత, ఆసక్తి గల వారు జూలై 31లోగా దరఖాస్తులను సంబంధిత అవార్డ్స్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా పంపించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీ దరఖాస్తులను పరిశీలిస్తుందని, ఎంపిక చేసిన వారికి న్యూ ఢిల్లీలో వచ్చే ఏడాది జనవరిలో రాష్ట్రపతి చేతులమీదుగా బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేయనున్నట్లు తెలిపారు.

డిగ్రీ స్పెషల్ డ్రైవ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి):డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీకళాశాలల విద్యార్థుల వివిధ సెమిస్టర్ల స్పెషల్ డ్రైవ్ పరీక్షల షెడ్యూల్‌ను మంగళవారం విడుదలచేసినట్లు డీన్ జి.పద్మారావు ఒకప్రకటనలో తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల వాయిదాపడిన 1,3,5 సెమిస్టర్ల స్పెషల్ డ్రైవ్ పరీక్షలను వచ్చే నెల 26వ తేదీ నుంచి నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే 2,4,6 సెమిస్టర్ల స్పెషల్ డ్రైవ్ పరీక్షల ఫీజు ఈనెల 17 నుంచి వచ్చే నెల 17లోగా చెల్లించాలని కోరారు. ఈ విద్యార్థులకు కూడా వచ్చే నెల 26 నుంచే పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

180 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుల మంజూరు

శ్రీకాకుళం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా మెగా డీఎస్సీని ప్రకటించింది. ఈమేరకు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులను సృష్టిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం జారీచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 2,260 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుల భర్తీచేయనుండగా **ఉమ్మడిశ్రీకాకుళం జిల్లాకు 180 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు** మంజూరయ్యాయి. జిల్లాలో 71 ఎస్‌జీటీ, 109 స్కూల్‌అసిస్టెంట్ పోస్టులు భర్తీచేయనున్నారు. డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) ద్వారా ఈపోస్టులను భర్తీచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఆటిజం, మానసిక వైకల్యంతో బాధపడే విద్యార్థులకు బోధించేందుకు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులను భర్తీ చేసేలా ప్రభుత్వం జీవో జారీచేసింది.

● గుజరాతీపేట,ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి):స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంపై స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సప్పటి మల్లేసు, ప్రధాన కార్యదర్శులు పంచాది గోవిందరావుజులు, సహాధ్యక్షులు నెమలిపురివిష్ణుమూర్తి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం భవిత కేంద్రాల్లో డిప్లొమా, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ ఐఈఆర్టీలను మిగతా రాష్ట్రాల మాదిరిగా భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు.

26న వేట నిషేధ భృతి పంపిణీ

శ్రీకాకుళం,ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి):మత్స్యకారులకు వేట నిషేధకాలంలో ప్రభుత్వం నుంచి ఆర్థిక భరోసా విడుదలవుతుందని రాష్ట్ర వ్యవసాయ, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఈనెల 26న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి చేతులమీదుగా వేట నిషేధ భృతి మత్స్యకారులకు భరోసా సహాయం కింద రూ.20 వేలు చొప్పున అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగాఉందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడి అధ్యక్షతన మంగళవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదంతెలిపారని వివరించారు. గతంలో రూ.10వేలు ఉండగా.. ఇప్పుడు రూ. 20వేలకు పెంచినట్లు తెలిపారు.

ఏజీపీగా భాగ్యలక్ష్మి

శ్రీకాకుళం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా నగరానికి చెందిన లాయర్ గొద్దు భాగ్యలక్ష్మి నియమితులయ్యారు. ఆమె మూడేళ్ల వరకు ఏజీపీగా కొనసాగుతారు. నెలకు రూ.10వేలు చొప్పున గౌరవవేతనం చెల్లించనున్నారు.ఈమేరకు రాష్ట్ర న్యాయశాఖ ప్రభుత్వ కార్యదర్శి గొట్టాపు ప్రతిభాదేవి మంగళవారం ఉత్తర్వులను జారీచేశారు.

కమ్యూనిటీ హైరింగ్ కేంద్రాల పరిశీలన

సరుబుజ్జిలి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి):కొండవలస, రొట్టవలస, కొత్తకోట, చిగురువలస రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హైరింగ్ కేంద్రాలను మంగళవారం ఏవో బి.పద్మనాభం పరిశీలించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారులు టి.రాము, ఎస్.అశోక్, వ్యవసాయ సహాయకులు ప్రసాద్, భగత్‌కుమార్, వెంకటలక్ష్మి, బెనర్జీ పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): తేలుకుంచి, బాలకృష్ణాపురం, లొద్దపుట్టి, బెల్లుపడ, కీర్తిపురం, కొళిగాం, బిర్లంగి, రత్తకన్న, కేదారిపురం గ్రామాల్లో గల కస్టమ్ హైరింగ్ సెంటర్‌ల్లో 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో రాయితీ తో ఏర్పాటు చేసిన పరికరాలను ఏవో టి.బార్గవి మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మల్లేశ్వరరావు, ప్రవీణ్, హరిత, దీక్షిత్, వెంకటేష్, భవాని, నిర్మల పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

జి.సిగడాం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి తెలిపారు. మంగళవారం పెనసాం, శేతుభీమవరం, గంగన్నదొరపాలేం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ గర్భస్థదశ నుంచి రెండేళ్ల పాటు సంరక్షణపై శ్రద్ధ తీసుకోవాలన్నారు.లబ్ధిదారులు తమంతట తామే పోషణ్‌ట్రాకర్‌లో నమోదు చేసుకొనే విధంగా ప్రచారం చేయాలన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలి

అరవసల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి):సచివాలయాల్లో పనిచేస్తున్న సంక్షేమ, విద్యా సహాయకులకు పదోన్నతులు కల్పించాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఈగల తిరుపతిరావు, సభ్యులు వజ్జ నరసయ్య, సుధ, నవీన్, శేఖర్ కోరారు.ఈ మేరకు స్థానిక 80 అడుగులరోడ్డులోగల కార్యాలయంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడికి వినతిపత్రం అందజేశారు.

ఫ్లోరెన్స్ నైటింగేల్‌లా పేరు తెచ్చుకోవాలి: వీసీ

అరసవల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి):నర్సింగ్ విద్యనభ్యసించేవారు ఫ్లోరెన్స్ నైటింగేల్ అంత పేరు తెచ్చుకోవాలని అంబేడ్కర్ వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ రజని ఆకాంక్షించారు.మంగళవారం జెమ్స్ నర్సింగ్ కళాశాలలో తొమ్మిదో బ్యాచ్ బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు, ఏడో బ్యాచ్ జీఎన్ఎమ్ విద్యార్థినులకు ల్యాంప్ లైటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీలలిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎస్‌తో 90 శాతం ఆడ దూడల జననం

పొందూరు,ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి):లింగనిర్ధారిత వీర్యం (సెక్స్‌సార్టెడ్ సెమన్)తో కృత్రిమ గర్భోత్పత్తి విధానంతో 90 శాతం ఆడదూడలు జన్మిస్తాయని ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్యకార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండలంలోని తోలాపిలో లింగనిర్ధారిత వీర్యం (ఎస్ఎస్ఎస్) ద్వారా జన్మించిన దూడలను శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ఎస్ఎస్‌విధానంవల్ల ఆడదూడలు జన్మించడంతో రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుందని తెలిపారు.రానున్నరోజుల్లో ప్రభుత్వం ఈ విధానాన్ని మరింత ప్రోత్సహిస్తుందని చెప్పారు.పేరుగాంచిన దేశీయ,విదేశీ జాతుల ఆవుల వీర్యాన్ని పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయనతోపాటు శ్రీకాకుళం డివిజినల్ డిప్యూటీ డైరెక్టర్ రామమోహన్‌రావు, ఈవో డీఎల్‌పి సత్యప్రకాశ్, విజయనగరం డిప్యూటీ డైరెక్టర్ దామోదరరావు, పొందూరు ఏడీ డాక్టర్ డిఎస్ఎస్ బాలకృష్ణ, వైద్యులు పద్మావతి, శ్రీనివాసరావు ఉన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

● నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి, పరిపాలనాపరమైన సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో భూపరిపాలన, తాగునీటి సరఫరా, ఐసీడీఎస్,పంచాయతీరాజ్, గ్రామ సచివాలయాల పనితీరుపై జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి మండల,జిల్లాస్థాయి అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు.రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదుల పరిశీలనను ప్రామాణికంగా డివిజన్ల స్థాయిలో పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.మునిసిపల్ కమిషనర్లు, జిల్లా ప్రణాళికాధికారి, గ్రామీణ నీటిపారుదలఅధికారుల మధ్య సమన్వయం తప్పనిసరిగా ఉండాలన్నారు. పల్లె పండుగ నేపథ్యంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను మెటీరియల్ కాంపొనెంట్ వినియోగాన్ని గ్రామస్థాయి ఇంజినీర్లు, సహాయ ఇంజినీర్ల వద్దే పర్యవేక్షించాలన్నారు.సూర్యగృహ పథకంలో బ్యాంకులు, కాంట్రాక్టర్ల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమగ్రశిశు అభివృద్ధి కేంద్రాల్లో మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీటి వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ పద్మావతి, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డీపీవో భారతీ సౌజన్య, వ్యవసాయాధికారి త్రినాథస్వామి, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్, ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

జిల్లాలో 857 చలివేంద్రాలు ఏర్పాటు

జిల్లాలో వేసవి త్రీవతను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు, ఎండ తీవ్రత నుంచి తాత్కాలిక ఉపశమనం కల్పించేందుకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు అధికారులు జిల్లా వ్యాప్తంగా 857 చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. వీటిలో 137 ప్రభుత్వ శాఖల ద్వారా, 693 స్థానిక సంస్థల ద్వారా, 27 స్వచ్ఛంద సంస్థలు, ఇతరుల ద్వారా ఏర్పాట్లు చేస్తున్నారు. జలుమూరు మండలంలో 40, కంచిలిలో 42, బూర్జ మండలంలో 34 చలివేం ద్రాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటుచేశారు. ఈ మేరకు ప్రతి మండలానికి మోనటరింగ్ అధికారి నియమించడంతో వాటి నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు. తాగునీరు, నీటి కూలర్లు, శీతల నీరు ఏర్పాట్లు, నీటి డబ్బాలు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. వేసవిలో పౌరులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, తాగునీటి అందుబాటును ఉంచేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు.



ఇచ్ఛాపురం: నిరసన తెలుపుతున్న కార్మికులు



ఆమదాలవలస: వినతిపత్రం అందజేస్తున్న మునిసిపల్ కార్మికులు

కార్మికులను పర్మినెంట్ చేయాలి

● ఇచ్ఛాపురం, ఆమదాలవలసలో మునిసిపల్ కార్మికుల నిరసన

ఇచ్ఛాపురం, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): ఏపీసీఓఎస్‌ని రద్దు చేస్తే కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రమేష్ పట్నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇచ్ఛాపురం మునిసిపల్ కార్యాలయం ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా సమస్యలు పరిష్కరించడంలేదని ఆరోపించారు. చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని,రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.ఐదు లక్షలు ఇవ్వాలని కోరారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మంగళ సత్తు, గంగాధర రధో, లక్ష్మణరావు, ఢిల్లీ పాల్గొన్నారు.

● ఆమదాలవలస, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకుడు తాడి సంతోష్ తెలిపారు. స్థానిక మునిసిపల్ కార్యాలయం ఎదుట తమ సమస్యలను పరిష్కరించాలని నిరసన తెలిపారు.అనంతరం మున్సిపల్ మేనేజర్ లక్ష్మీనారాయణ బిసోయ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ యూనియన్ నాయకులు కె.తారకేశ్వరరావు,శ్రీనివాస్, కె.ఈశ్వరరావు,రాజేష్ పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో కార్పొరేషన్ల నిర్వీర్యం

● ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



వాహనం తాళం అందజేస్తున్న రవికుమార్

ఆమదాలవలస, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆరోపించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో పొందూరు మండలంలోని లోలుగు గ్రామానికి చెందిన సవరి పార్వతికి ప్రధానమంత్రి మత్స్యసంపద యోచన కింద మంజూరైన వాహనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ రుణ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టీడీపీ ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మళ్లీ కార్పొరేషన్లను పరుగులు పెట్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు వై.సత్యంనాయుడు, బి.సురేష్, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సిద్ధాంతాలతోనే సుస్థిర సాధికారిత



మాట్లాడుతున్న అర్జున్

ఎచ్చెర్ల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి):రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలు, సిద్ధాంతాలతోనే సుస్థిరమైన సాధికారిత సాధించగలమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ సోషల్ వర్క్ విభాగం బీవోఎస్ ఛైర్మన్ ప్రొఫెసర్ పి. అర్జున్ తెలిపారు.వర్సిటీలో సోషల్‌వర్క్, అంబేడ్కర్ అధ్యయన కేంద్రం సంయుక్తంగాజాతీయ సామాజిక శాస్త్రాల పరిశోధన మండలి- దక్షిణ ప్రాంతీయకేంద్రం (ఐసీ ఎస్ఎస్ ఆర్- ఎస్ఆర్‌సీ) హైదరాబాద్ సహకారంతో విస్మరించిన వర్గాలకు సాధికారిత-సామాజిక పని విలువలపై రెండురోజుల పాటు నిర్వహించిన జాతీయ సెమినార్ మంగళవారంతో ముగిసింది.ఈసందర్భంగా ఆయన అంబేడ్కర్ తాత్విక దృక్కోణం, సామాజిక న్యాయం, సోషల్ వర్క్ విలువలు తదితర అంశాలను ప్రస్తావించారు. వీసీప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ సమాజంలోని వాస్తవ పరిస్థితులను తెలుసుకుని వాటి పరిష్కారంలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, రాష్ట్ర మానవ హక్కుల ఫోరం ప్రధాన కార్యదర్శి వీఎస్ కృష్ణ, బెజ్జిపురం యూత్‌క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు, సెమినార్ కన్వీనర్ డాక్టర్ యు.కావ్యజోత్స్న, కోకన్వీనర్ డి.వనజ పాల్గొన్నారు.

అర్హులను ఓటర్లుగా నమోదు చేయండి: ఆర్వో

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతిఒక్కరికి కొత్త ఓటర్లగా నమోదుచేయాలని ఆర్వో పద్మావతి కోరారు. మంగళవారం ఇచ్ఛాపురం రోటరీ హాల్‌లో ఆర్వో అధ్యక్షతన నియోజకవర్గంలోని బీఎల్‌వోలకు ఓరియంటేషన్ ట్రైనింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్వో ఎన్నికలమేనేజ్‌మెంట్, ఫారం-6,7,8పై అవగాహన కల్పించారు.నియోజకర్గంలోని నాలుగు మండలాల్లో మొత్తం 2,70,349 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట తహసీల్దార్లు వెంకటరావు, రమేష్, మోహన్‌రావు, అప్పలస్వామి, జనసేన, టీడీపీ, వైసీపీల ప్రతినిధులు దాసరి రాజు, ధర్మారావు, ప్రకాష్‌రావుపట్నాయక్‌పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లల ను ప్రభుత్వబడుల్లో చేర్పించాలని ఎంఈవో కె. అప్పారావు కోరారు. మంగళవారంముచ్చింద్ర, ధర్మపురం గ్రామాల్లో అప్పారావుతో పాటు ఎంఈవో-2 ఎస్.విశ్వనాధం పర్యటించి ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల గురించి తల్లిదం డ్రులకు వివరించారు. ముచ్చింద్రలో వేతనదారులకు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు.

● రణస్థలం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో బి. లావణ్య కోరారు. మంగళవారం మరువాడలో విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయని తెలిపారు.



ఇచ్ఛాపురం:వేతనదారులతో మాట్లాడుతున్న అప్పారావు

గురుకుల విద్యార్థుల ప్రతిభ

కంచిలి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గురుకులానికి చెందిన 11మంది విద్యార్థులు ఆల్ ఇండియా చిల్డ్రన్ యూత్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన ఎగ్జిబిషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచారు. ఈ మేరకువరల్డ్ ఆర్ట్ డే పుర్కరించుకుని విద్యార్థులు సాధించిన బంగారు పతకాలు, సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ బమ్మిడి అప్పారావు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు, పైల గణపతిరావు, డిక్కల మన్మథరావు పాల్గొన్నారు.

వంతెన పనులు ప్రారంభించాలి

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బాహుదానది వంతెన పనులు ప్రారంభించాలని జడ్పీ చైర్‌పర్సన్, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పిరియా విజయ కోరారు. ఈ మేరకు మంగళవారం ఇచ్ఛాపురం వద్ద బాహుదా నదిపై వంతెనను పరిశీలించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ వంతెన కూలిపోతే రూ.70 లక్షలతో వైసీపీ ప్రభుత్వం తాత్కాలిక పనులు చేపట్టి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేసినట్లు తెలిపారు.

వాండ్రంగిలో నేతాలమ్మ యాత్ర

జి.సిగడాం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాండ్రంగిలో మూడు రోజులుగా జరుగుతున్న నేతాలమ్మ యాత్ర మహోత్సవాలుమంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులతో నేతాలమ్మ ఆలయం కిటకిటలాడింది. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ముర్రాటలు చెల్లించుకొని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ, సరిసర గ్రామాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

సీతారాముల కల్యాణం

జి.సిగడాంలో మంగళవారం పట్టుశాలి వీధిలో రామాలయం వద్ద సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలకు మేళతాలలు నడుమ తిరువీదిని నిర్వహించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

సోంపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అగ్నిమాపక వారోత్సవాలు పురస్కరించుకుని మంగళవారం అగ్నిప్రమాదాల నివారణపై ఆ శాఖ అధికారి ఎస్.మోహనరావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది ఎం.రమేష్ నాయుడు, కె.భాస్కరరావు,సింహాచలం పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో అప్రమత్తంగా ఉంటే సులభంగా నివారించవచ్చని అగ్నిమాపకదళ అధికారి కె.ప్రశాంత్‌కుమార్ తెలిపారు.ఇచ్ఛాపురంలోని దాసన్నపేట జంక్షన్ నుంచి మార్కెట్ మీదుగా అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాల నివారణకు చర్యలపై ప్రజలకు అవగాహప కల్పిస్తూ విద్యార్థులతో పాత బస్టాండ్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎర్రన్నాయుడు జంక్షన్‌లో అగ్రిమాపక విన్యాసాలు ప్రదర్శించారు.కార్యక్రమంలోసూర్యారావు, నీలాచలం, కామరాజు, ప్రసాద్, ఎన్‌డీ ప్రసాద్, ఈశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- తొమ్మిది నెలల కిందట వివాహం
- కుమార్తె మృతికి అత్తింటివారే కారణమని బంధువుల ఆరోపణ




మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ (ఇన్‌సెట్‌లో) భవాని (ఫైల్)

జి.సిగడాం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతవురిటి గ్రామానికి చెందిన వివాహిత బాలబొమ్మ భవాని (21) మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. పాలఖండ్యాం గ్రామానికి చెందిన దారబోయిన భవాని, సంతవురిటి గ్రామానికి చెందిన సచివాలయం లైన్‌మెన్ బాలబొమ్మ దినేష్‌కు తొమ్మిది నెలల కిందట వివాహం జరిగింది. భవానీ, దినేష్‌ల మధ్య కొంత కాలంగా మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో భవాని మృతి చెందిందని ఆమె సోదరుడు నాగ రాజుకి దినేష్ ఫోన్ చేసి తెలియజేశాడు. దీంతో బంధువులు సంఘటనా స్థలానికి చేరుకొని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందింది. భవాని మెడపై గాయాలు ఉండడంతో తమ కుమార్తె మృతికి అల్లుడు దినేష్, అత్తింటి వారే కారణమని కుటుంబ సభ్యు లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సమాచారం తెలుసుకున్న జేఆర్‌పురం సీఐ అవతారం, లావేరు ఎస్ఐ లక్ష్మణరావు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించిన అనంతరం దినేష్‌ని విచారించి అదుపులోకి తీసుకున్నారు. భవాని తండ్రి దారబోయిన రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ అవతారం తెలిపారు. రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో మృతదేహానికి శవపంచనామా చేసి, పోస్టుమార్టం నిమిత్తం రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

రైలు ఢీకొని వ్యక్తి..

ఆమదాలవలస, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస (శ్రీకాకుళం రోడ్డు) రైల్వేస్టేషన్ పరిధిలోని వెంగళరావుకాలనీ సమీపంలో అప్‌లైన్ ట్రాక్‌పై మంగళవారం రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ ఎస్ఐ మధుసూదనరావు కథనం మేరకు.. బూర్జ మండలం పాలవలస గ్రామానికి చెందిన సురవరపు శ్రీనివాసరావు (42) వ్యక్తిగత పనులపై ట్రాక్ దాటు తుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. దీంతో ఆయన మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని గుర్తించారు. మృతుడికి భార్య భవాని, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

చికిత్సపొందుతూ వృద్ధుడు..

ఎచ్చెర్ల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకపాలెం ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద జరిగిన ప్రమాదంలో గాయపడిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. విజయనగరం జిల్లాలోని రేగిడి ఆమదాలవలస మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ముగడ చిన లచ్చయ్య (74) సోమవారం లావేరు మండలంలోని బుడుమూరు సంతకు వచ్చాడు. తన పనులను ముగించుకుని రాత్రి వేరే చోట ఉన్నాడు. మంగళవారం తన స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో చిలకపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద నిల్చొని ఉన్న లచ్చయ్యను సర్వీసు రోడ్డులో వస్తున్న లారీ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడడంతో ఆయన్ను శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. లచ్చయ్యకు భార్య, నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య సూరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు..

కొత్తూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మేదర వీధికి చెందిన ఆరిక గడ్డియ్య(47) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్ఐ అమీర్ అలీ తెలిపారు. ఈనెల 13న బహిర్భూమి నిమిత్తం వెళ్లిన గడ్డియ్య ఎప్పటికీ ఇంటికి రాకపోవడంతో పలు చోట్ల కుటుంబ సభ్యులు వెతకటం ప్రారంభించారు. గ్రామానికి సమీపంలో ఉన్న చెరువులో ఒక మృతదేహం ఉన్నట్లు గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటన స్థలానికి ఎస్ఐ సిబ్బందితో చేరుకొని పరిశీలించి గడ్డియ్య మృతదేహంగా గుర్తించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

48 ఒడిశా బీరు సీసాలు సీజ్

ఇచ్ఛాపురం,ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఒడిశాలో కొనుగోలు చేసిన 48 బీరు సీసాలు తరలిస్తుండగా సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం ధనరాజ తులసమ్మ ఆలయం సమీపంలో జాతీయ రహదారి వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు మద్యం తరలిస్తున్న పెదిని శంకర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. అలాగే ఇచ్ఛాపురం స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి రత్తకన్నలో బహిరంగంగా మద్యాన్ని సేవిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బహిరంగంగా మద్యం విక్రయిస్తున్న బొరివంకకు చెందిన దొలాయి సకంతిని, 10 మద్యం సీసాలతో కుసుమపురానికి చెందిన కె.దుర్యోధనను అరెస్ట్ చేశామని తెలిపారు.

16 మద్యం బాటిళ్లతో..

రణస్థలం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నెలివాడ జంక్షన్ వద్ద ఓ పాన్ షాపులో 16 బీరు సీసాలతో మనోజ్ అనే వ్యక్తి జేఆర్‌పురం పోలీసులకు మంగళవారం పట్టుబడ్డాడు. ఆయనపై జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

20 లీటర్ల సారా స్వాధీనం

కంచిలి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కత్తివరం, మఖరాంపురం గ్రామాల్లో నిర్వహించిన దాడుల్లో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కె.బేబీ తెలిపారు. నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలిసి గ్రామాల్లో అక్రమంగా నిల్వఉంచిన సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.ఈ మేరకు కీశ్ల ఇంద్ర, సుబుద్ధి చంద్రావతి, కొర్రాయి రామారావు, కొరికాన చంద్రయ్య సాహుకారీ మహేష్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరితో పాటు అరవసరియాపల్లి, జాడుపూడి కాలనీకి చెందిన పాత సారా కేసుల్లో పట్టుబడిన మద్దిలి లింగరాజు, బతకల డొంబురు, డొప్ప సరోజిని తదితర ఎనిమిది మందిని అరెస్టు చేశామని చెప్పారు.

కుద్దిరాంలో గడ్డికుప్ప దగ్ధం

ఆమదాలవలస, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలోని 21వ వార్డు పరిధిలోని కుద్దిరాంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డి కుప్ప దగ్ధమైంది. అగ్నిమాపకశాఖ ఎస్ఐ అప్పారావు కథనం మేరకు.. కుదిరాంకు చెందిన పడ్డ ఎర్రయ్య గడ్డి కుప్పకు నిప్పు అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. దీంతో గ్రామానికి చెందిన సాధు చిరంజీవిరావు అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేసి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడకు చేరుకొని అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు 30 వేల వరకు నష్టం సంభవించింది. మంటలు అదుపు చేసే ప్రక్రియలో అగ్నిమాపక సిబ్బంది జి.వెంకటరమణ, చక్రధరరావు, సురేష్‌బాబు, ఎం.ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో పక్షులను రక్షిద్దాం

సంతబొమ్మాళి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో వేసవి కాలంలో పక్షులను రక్షిద్దాం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నీటికోసం ఇబ్బందులు పడుతూ పెద్ద సంఖ్యలో పక్షులు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో మట్టి పాత్రలు తయారు చేసించి వాటిని విద్యార్థులు కొనేట్లు చైతన్యం చేశారు. వీటిని ఇంటి పైకప్పులపై ఉంచి పక్షులకు నీటిని అందించాలని ఉపాధ్యాయులు సూచించారు. హెచ్ఎం కోత చైతన్య, ఉపాధ్యాయులు భాస్కరరావు, ఆదికేశవరెడ్డి, వీరభద్రరావు పాల్గొన్నారు.

చేనేతకు చేయూత

- ఇళ్లకు 200, పవర్‌లూమ్‌కు 500 యూనిట్ల విద్యుత్ ఉచితం



వస్త్రాలు నేస్తున్న చేనేత కార్మికులు

హిరమండలం,ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కుల వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న నేత కార్మికు లను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అమలు చేసేందుకు అడుగులు వేసింది. మగ్గాలున్న చేనేత కార్మికుల ఇళ్లకు 200, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా అందించనుంది. వైసీపీ ప్రభుత్వంలో చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసిన నేపథ్యంలో ఆ కార్మికులకు భరోసా కల్పించి ఆదుకునే చర్యలు చేపట్టింది. గతంలో ఉన్న ఆంక్షలను సడలించింది. గతంలో 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేసేవారు. ఆ పరిమితి దాటి 101 యూనిట్లు వాడినా మొత్తం బిల్లు కట్టాల్సి వచ్చేది. దీంతో నేత కార్మికులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఆ నిబంధనలను తొలగించి పరిమితి దాటిన తరువాత వాడిక యూనిట్లకే బిల్లు వసూలు చేయనున్నారు. గత టీడీపీ హయాంలో ఈ విధానాన్ని అమలు చేసింది. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం దీనిని తొలగించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం మరలా పాత విధానాన్ని పునరుద్ధరించి నేత కార్మికులకు భరోసా కల్పించింది. ఈ మేరకు క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల వివరాలను సేకరించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో సుమారు 5వేలకు పైగా చేనేత కుటుంబాలున్నాయి. రడీమేడ్ వస్త్రాల వ్యాపారం ఊపందుకోవడంతో చేనేత వస్త్ర వ్యాపారం తగ్గు ముఖం పట్టింది. గిట్టుబాటు లేక వృత్తిని వదిలి ఉపాధి కోసం ఇతర మార్గాలను అన్వేషించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం వారికి భరోసా కల్పిస్తుందని, మరలా నేతలకు డిమాండ్ వచ్చే అవకాశం ఉందని పలువురు కార్మికులు పేర్కొంటున్నారు. జిల్లాలో 38 చేనేత సహకార సంఘాలుండగా వీటిలో 12 మాత్రమే నామమాత్రంగా పనిచేస్తున్నాయి. జిల్లాలో ఇప్పటికీ సుమారు 13 వందల కుటుంబాలు మాత్రమే చేనేత వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. వీరిలో అర్హులైన వారందరికీ ఉచిత విద్యుత్ రాయితీ వర్తిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఈకేవైసీ పేరుతో దందా?

- చేతివాటం ప్రదర్శించిన డీలర్

పలాసరూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రేషన్‌దారులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో కొందరు సిబ్బంది పంటపండింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం, వారికి ఇక్కడ రేషన్ అందిస్తుండడంతో అటువంటి వారంతా ఈకేవైసీ చేయించుకోవాల్సిన పరిస్థితి. ఇదే అదునుగా సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటువంటి వారి అవసరాన్ని ఆసరాగా చేసుకుని మండలంలోని ఓ డీలర్ అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శలొస్తున్నాయి. తన పరిధిలోని రెండు గ్రామాలకు చెందిన వారు ఎక్కడెక్కడ ఉన్నారో తెలుసుకుని వారికి వారున్న రాష్ట్రాలకు వెళ్లి ఈకేవైసీ నమోదు చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో ఎక్కువ మంది ఈ గ్రామాలకు చెందిన వారు ఉన్న ప్రాంతానికి వెళ్లి ఈకేవైసీ నమోదుకు ఒక్కొక్కరి వద్ద రూ.500 నుంచి రూ.1000 వరకు వసూలు చేసినట్లు సమాచారం. వృద్ధులు రాకపోకలకు డబ్బులు ట్రైన్లకు, బస్సులకు రూ.2 వేలు వరకు అవుతుండడంతో వారంతా ఈకేవైసీ నమోదుకు డీలరు అడిగినంతా ఇచ్చుకున్నారు. కాని కొందరు యువత ఈ విషయంలో అడ్డు తగిలినా సదరు డీలర్ తాను చేసుకుంటూ పోవడంతో అసలు విషయం బయట పడింది. డీలర్ అక్రమాలపై ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లాయి. అలాగే మరో గ్రామానికి చెందిన ఓ డీలరుపై కూడా లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు అందడంతో వీరిరు వురుపై విచారణకు ఆదేశించినా నేటికీ ఎటువంటి చర్యలు లేకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై తహసీల్దార్ ఎస్.కల్యాణ చక్రవర్తిని వివరణ కోరగా విచారణకు ఆదేశించామని, నివేదిక అందిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నా: ఎమ్మెల్యే ఎంజీఆర్



శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నేను మీ సేవకుడిని.. అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నానని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక సీపీరోడ్ నుంచి చంగుడి మీదుగా మాకనాపల్లి కూడలి వరకు రూ.3.05 కోట్ల ఉపాధి నిధులతో చేపట్టనున్న రోడ్డు పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఎక్స్‌కవేటర్‌తో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడున్నర దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించడం ఆనందంగా ఉందన్నారు. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. రూ.450 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ ప్రసాదరావు తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, టీడీపీ నేతలు నందిగామ ఆనందరావు పైల బాబ్జీ, సైలాడ సతీష్, టి.తిరుపతిరావు, మడ్డు రామారావు తదితరులు పాల్గొన్నారు.

కుడికాలువ పనులు పూర్తి చేయండి

పాతపట్నం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వంశధార కుడి కాలువ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదేశించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం వంశధార అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్ట్ ఆధునికీకరణ పనుల కోసం ఇప్పటికే రూ.1.75 కోట్లు ఉపాధి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. రానున్న ఖరీఫ్ నాటికి శివారు ప్రాంతాలకు సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గండ్లు పూడ్చడం, పూడికతీత, రక్షణ గోడల నిర్మాణం, మర మ్మతు పనులు చేయించాలన్నారు. ఈఈ ఎంవీ రమణ, డీఈ సురేష్ కుమార్, జేఈలు శ్రీనివాస్, సోమేష్ పాల్గొన్నారు.

దళిత, గిరిజనుల భూములను కాపాడాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పాతపట్నం, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజనుల భూములను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నుంచి కాపాడాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకట రమణ మాట్లాడుతూ.. 40 ఏళ్ల కిందట ల్యాండ్ సీలింగ్ సమయంలో మాజీ నక్సలైట్, ఇద్దరు ఆర్మీ ఉద్యోగులకు, పలు దళిత, గిరిజన కుటుంబాలకు ఇచ్చిన భూములపై కన్నేసి సొంతం చేసుకునేందుకు అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. అటువంటి చర్యలు మానుకుని ఇప్పటికే సాగు చేస్తున్న వారికి పట్టాలివ్వాలని కోరారు. బాధితులకు న్యాయం జరగకుంటే రైతులపక్షాన పోరాటాలకు సిద్ధమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్ కొన్న శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు ఆచారి ఆది నారాయణ, త్రినాథ్, బాధిత రైతులు దూసి భాస్కరరావు, ముడిదాన శివ, బిడ్డిక భాస్కర్, తాలాడ రవణమ్మ, దుక్క చిన్నవాడు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో నర్సరీ మొక్కల పెంపకం



మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న డ్వామా పీడీ సుధాకర్, రేంజర్ జగదీశ్వరరావు

నరసన్నపేట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో సామాజిక అటవీ శాఖ ఆధ్వర్యంలో నర్సరీలో మొక్కలు పెంపకం చేపడుతున్నామని డ్వామా పీడీ బి.సుధాకర్ అన్నారు. మంగళవారం తామరాపల్లి కార్యాలయంలో మొక్కలు పెంపకాన్ని పరిశీలించారు. వచ్చే జూన్ నాటికి మొక్కలు నాటేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. చెరువు గట్లు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను వేతనదారులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సోషల్ ఫారెస్టు రేంజర్ జగదీశ్వరరావు, ఏపీవో యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తామరాపల్లి గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించారు.

ప్రతిపాదనలు తయారుచేయండి

టెక్కలి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయిలో వివిధ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని డ్వామా పీడీ బి.సుధాకర్ సూచించారు. మొఖలింగా పురం, నర్సింగపల్లి పంచాయతీల్లో చేపట్టాల్సిన పనులపై తొమ్మిది బృందాలను ఏర్పాటు చేసి వారి ద్వారా 300 పనులుచేయించేందుకు మంగళవారం సూచనలు చేశారు. గ్రామాల్లో చెక్‌డ్యామ్‌లు, ఫాంపాండ్స్, పూడికలు తొలగింపు, మదుముల నిర్మాణం, చెరువు, గెడ్డలు, వాగుల అభివృద్ధి, బండింగ్ పనులు, చెక్ వాల్స్, సీసీటీలు, ట్రెంచ్‌వర్క్‌లు, రాతి కట్టడాలు, మొక్కలు పెంపకం చేపట్టను న్నామన్నారు. కార్యక్రమంలో గ్రౌండ్‌వాటర్ డీడీ సుధాకర్, ఏపీడీ శైలజ, ఏపీవో ప్రసాదరావు, పోలాకి షణ్ముఖరావు, గుజ్జారు సత్యం తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

సంతబొమ్మాళి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గొదలాం గ్రామంలో తండ్రి, కుమార్తెపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వై.సింహాచలం తెలిపారు. మంగళవారం గ్రామానికి చెందిన పిట్ట పాపారావు తన కుమార్తె లక్ష్మీప్రియను బోరుభద్రలోని పాఠశాలకు స్కూటీపై తీసుకు వస్తుండగా గ్రామానికి చెందిన పిట్ట ముఖలింగం మరో ఇద్దరితో కలిసి దాడి చేసి గాయపర్చాడని ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యకు అధిక ప్రాధాన్యం: ఎమ్మెల్యే బగ్గు



విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట/పోలాకి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యకి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం కత్తిరివానిపేట క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మోడల్ పాఠశాలల ఏర్పాటు, ఎన్‌రోల్‌మెంట్ పెంపుపై ఆరా తీశారు. విద్యతో సమాజం అభివృద్ధి చెందు తుందని, అందువల్లే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడు తున్నాయన్నారు. పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పి.దాలినాయుడు, నాయక్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జయంతి అధికారికంగా నిర్వహించాలి

పలాస, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత సీఎం ఎన్టీఆర్ జయంతిని ప్రభు త్వం అధికారికంగా నిర్వహించాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి సీఎం చంద్రబాబు జన్మదిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు విశాఖలో నిర్వహిస్తున్నామన్నారు. అలాగే మే 28న ఎన్టీఆర్ జయంతిని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు పాల్గొన్నారు.

ముగిసిన బంగారమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



మొక్కులు చెల్లించేందుకు వెళుతున్న మహిళలు

పాతపట్నం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కొరసవాడ గ్రామంలో బంగారమ్మ తల్లి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు గ్రామ మహిళలంతా ప్రత్యే క వస్త్రధారణతో కలశాలు, ప్రసాదాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి రూ.50 వేలు విరా ళం అందించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొనడంతో ఆధ్యాత్మిక శోభ వెల్లివి రిసింది.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

పోలాకి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు విరామం ప్రకటించినందున మత్స్యకారులు వేట చేయ వద్దని ఎఫ్‌డీవో సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం నుంచి 61 రోజుల పాటు సముద్రంలో యంత్రాలతో వేట నిషేధించిన నేపథ్యంలో సాగరతీర గ్రామాల్లో పర్యటించి మత్స్యకారులకు అవగాహన కలిగించారు. రాజారాంపురం, గుప్పెడుపేట, కొత్తరేవు, గుల్లవానిపేట తదితర గ్రామాల్లో పర్యటించారు. వేట నిషేధ సమయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో డిల్లీశ్వరరావు, వెంకటేష్, కృష్ణసాగర్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

కనులపండవగా శ్రీరామ పాదుకా పట్టాభిషేకం

జలుమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బసివాడ గ్రామంలోని సీతారామ లక్ష్మణ ఆలయంలో మంగళవారం శ్రీరామ పాదుకా పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని చివరిరోజు పురోహితులు వెంకట కృష్ణారావు ఆధ్వర్యంలో అర్చకులు నరేష్ నేతృత్వంలో శ్రీరాముని పాదుకా పట్టాభిషేకం చేశారు. కార్యక్రమంలో బసివాడ, ఈదులవలస, మట్టవానిపేటలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను కాపాడుకోవాలి

టెక్కలి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించడం ద్వారా వాటిని కాపాడుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు అన్నారు. మంగళవారం టెక్కలి, నందిగాం మండల శాఖల ఆధ్వర్యంలో 'ప్రభుత్వ బడిని బలోపేతం చేద్దాం' అనే విషయమై మండల అధ్యక్షుడు పి.గణపతిరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు గ్రామాల్లో బడిబాట చేపట్టి విద్యార్థుల నమోదు ను పెంచాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కురమాన దాలయ్య, ధర్మారావు, దవల వైకుంఠరావు, బి.శంకరరావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ స్థలం ఆక్రమణ



ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

హిరమండలం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): హిరమండలం బ్యారేజీ సెంటర్‌లోని పీహెచ్‌సీకి చెందిన స్థలాన్ని అక్రమార్కులు ఆక్రమించారు. సుమారు 5 సెంట్ల స్థలాన్ని ఆక్రమించి స్తంభాలను పాతారు. గడచిన మూడు రోజులుగా ప్రభుత్వ సెలవులు కావడంతో రాత్రి సమయంలో స్థలం చుట్టూ స్తంభాలు పాతారు. విషయం తెలుసు కున్న రెవెన్యూ అధికారులు మంగళవారం సదరు స్థలాన్ని పరిశీలించారు.

ఆక్రమణదారుల విషయమై ఆర్ఐ ఉమాశంకర్, సర్వేయర్ రమణయ్య ఆరా తీసినా ఎవరనేది తెలియ రాలేదు. ఈ విషయమై తహసీల్దార్ హనుమంతరావు మాట్లాడుతూ.. పీహెచ్‌సీకి చెందిన ఖాళీ స్థలాన్ని ఉద్యానం-2 ప్రాజెక్టుకు కేటాయించినట్లు చెప్పారు. ఈ స్థలంలో ఆక్రమణలు తొలగిస్తామని ఆయన పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

'మనమిత్ర'పై అవగాహన కలిగించాలి

నందిగాం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మనమిత్ర వాట్సాప్‌పై ప్రజలకు అవగాహన కలిగించాలని ఎంపీడీవో టి.రాజారావు అన్నారు. మంగళవారం దీనిపై పంచాయతీ కార్యదర్శులకు దిశ నిర్దేశం చేశారు. ఇంటింటికీ మనమిత్ర అంశంపై ప్రజలకు వివరించి ఈ సేవలను వినియోగించుకునేలా చూడాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

హరిపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం పి.కూర్మారావు అన్నారు. సరియాపల్లి, జగన్నాథపురం గ్రామాల్లో డ్వాక్రా మహిళలు చేపడుతున్న వార్షిక క్రెడిట్ ప్లాన్‌లను మంగళవారం తనిఖీ చేశారు. పేద, మధ్య తరగతి మహిళా కుటుంబాలు జీవనోపాధి మెరుగుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవాల'ని కోరారు. కార్యక్రమంలో సీసీ మీనాక్షి, ముఖలింగం, రేవతి తదితరులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ

నరసన్నపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడలో నిర్వహించిన 12వ ఆల్ ఇండియా యూత్ అండ్ చిల్డ్రన్ చిత్రలేఖనం పోటీల్లో సత్యవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు హెచ్ఎం ఓకులాదేవి తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో వీరిని అభినందించారు. ఏడుగురు విద్యార్థులు బంగారు, ఐదుగురు రజిత పతకాలు సాధించారు. డ్రాయింగ్ ఉపాధ్యాయుడు తిరుమలరావును అభినందించారు.

యంత్ర పరికరాలను వినియోగించుకోండి

కోటబొమ్మాళి, ఏప్రిల్ 15, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ల ద్వారా రాయితీపై అందిస్తున్న వ్యవసాయయంత్ర పరికరా లను అద్దె ప్రాతిపదికన రైతులు వినియోగించుకోవాలని టెక్కలి ఏడీఏ బీవీ తిరుమలరావు అన్నారు. మంగళవారం రేగులపాడు సచివాలయం పరిధి కమ్యూ నిటీ హైరింగ్ సెంటర్‌ను సందర్శించారు. రైతు సేవా కేంద్రాల్లో అద్దెకు కావాల్సిన యంత్రాలను నమోదు చేసుకుంటే వాటిని రైతులకు అందుబాటులో ఉంచుతామ న్నారు. ప్రస్తుతం వేసవి దుక్కులకు ఈ యంత్రాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో ఎస్. గోవిందరావు, వీఏఏ కె.భవాని, ఎంపీటీసీ పట్ట సింహాచలం, రైతులు పాల్గొన్నారు.

ఈనెల 19న జాబ్‌మేళా

టెక్కలి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో ఈనెల 19న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జేకేసీ కో-ఆర్డినేటర్ బి.ఝాన్సీరాణి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అవసరమైన వారు వినియోగించుకోవాలని కోరారు.

పౌష్టికాహారం పంపిణీకి చర్యలు

మెళియాపుట్టి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వాలు పోషణ్ పట్వాడ్ కార్యక్రమం చేపడుతున్నా యని ఐసీడీఎస్ సీడీపీవో విమలారాణి తెలిపారు. మంగళవారం పెద్దపద్మాపురం సెక్టార్‌లో పోషణ్ పట్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా అంగన్ వాడీ కేంద్రాల ద్వారా సరుకులను ముందు గానే సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్ర మజ్జి, రాజు, కార్యదర్శులు శ్వేత, కల్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

- కోటబొమ్మాళి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బిడ్డ పుట్టిన తరువాత రెండేళ్ల వరకు పోషకాహారం తీసుకోవడం ద్వారా బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని ఎంఈవో ఎల్వీ ప్రతాప్ సూచించారు. పోషకాహార పక్షోత్సవం సందర్భంగా మంగళవారం సీతన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.